దడపుట్టిస్తున్న పండ్ల ధరలు

- భారీగా పెరిగిన పండ్ల ధరలు
- సామాన్యులకు అందుబాటులో లేని వైనం
- వ్యాపారులకు తప్పని ఇబ్బందులు



కొవ్వూరు టోల్‌గేట్ వద్ద విక్రయిస్తున్న పండ్లు

తాళ్లపూడి: అసలే సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు పెరిగిన పళ్ల ధరలతో కొనుగోలు చేయాలంటేనే భయపడుతున్నారు. అనారోగ్యం వచ్చిందని డాక్టర్ దగ్గరికి వెళ్తే చికిత్స అనంతరం పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిదని సూచిస్తారు. పండ్లలో అధిక పోషక విలువలు ఉంటాయి. ప్రస్తుతం మార్కెట్‌లో వీటి ధరలు చుక్కలనంటుతూ వినియోగదారుకు దడపుట్టిస్తున్నాయి. దీంతో పేద మధ్య తరగతి ప్రజలకు పండ్లు కొనలేని, తినలేని స్థితిలో ఉన్నారు. ముఖ్యంగా యాపిల్, దానిమ్మ, కివీ, కర్బూజా, పైనాపిల్, ద్రాక్ష పళ్లతో పాటు స్థానికంగా దొరికే సీతాఫలం, జామ, బొప్పాయి, నారింజ, బత్తాయి, అరటి తదితర పండ్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. మార్కెట్‌కు డిమాండ్ ఉన్న మేరకు పండ్లు రాకపోవడంతో మరింతగా డిమాండ్ పెరిగిందని వ్యాపారులు అంటున్నారు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

పండ్ల ధరలు పెరగడంతో నియోజకవర్గంలో కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో 40 వరకు పళ్ల దుకాణాలున్నాయి. ఇవి కాకుండా మరో 50 మంది వరకు నిత్యం సైకిళ్లపై పళ్లు విక్రయాలు చేస్తు ఉపాధి పొందుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం రాజమండ్రి, తాడేపల్లిగూడెం తదితర మార్కెట్లలో దిగుమతి చేసుకుంటున్న హోల్‌సేల్ వ్యాపారుల వద్ద నుంచి ఇక్కడి వ్యాపారులు పండ్లు కొనుగోలు చేసుకుని తీసుకువచ్చి విక్రయిస్తారు. అక్కడి నుంచి స్థానిక మార్కెట్లకు సరుకు తీసుకు రావడానికి రవాణా ఖర్చులు తడిసిమోపేడు అవుతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు.

పెరిగిన ధరలు..

యాపిల్ డజను 300 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. సీతాఫలం 10 కాయలు రూ.250, నుంచి రూ.300 వరకు అమ్మకాలు చేస్తున్నామని తెలిపారు. దానిమ్మ డజను రూ.300, బత్తాయి 12 రూ.200 నుంచి రూ.250, నల్ల ద్రాక్ష కిలో రూ.130, పైనాపిల్ రెండు రూ.80, చక్కరకేళీ అరటి పళ్ల డజను రూ.70 నుంచి రూ.80గా విక్రయిస్తున్నారు. అరటి కర్పూరం డజను రూ.50, బొప్పాయి ఒకటి రూ.60, కర్బూజా ఒకటి రూ.50 వరకు పెరిగాయి. కివీ పళ్లు నాలుగు రూ.150, డ్రాగన్ ఫ్రూట్ రెండు ఒక్కటి రూ.100 చొప్పున అమ్మకాలు విక్రయిస్తున్నారు.

మార్కెట్లో డిమాండ్..

ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పంటల దిగుబడి పై ప్రభావం పడిండదని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో పండ్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడడంతో ధరలు పెరిగాయని దుకాణదారులు చెబుతున్నారు. ధరలు పెరగడంతో ప్రజలు కొనుగోళ్లు తగ్గిస్తున్నారు. దీంతో వ్యాపారం జరగక వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరకు సకాలంలో అమ్ముడు కాక పోవడంతో పండ్లు చెడిపోయి మరింతగా నష్టం జరుగుతుందని వాపోతున్నారు. పలువురు వ్యాపారులు పండ్లు పూర్తి స్థాయిలో తీసుకురాలేక వ్యాపారాలు సైతం మానేస్తున్నారు.కొనుగోలుదారులు పండ్లు ధరలు దిగిరావాలని అంటున్నారు.

పండ్లకు డిమాండ్



మార్కెట్‌లో పండ్లకు విపరీతమైన డిమాండ్ పెరగడంతో పండ్లు దొరకడం గగనంగా మారింది. రాజమండ్రి నుంచి సరకు కొనుగోలు చేసి తీసుకురావాల్సి వస్తుంది. పెగిన ధరలతో ఇబ్బంది పడుతున్నాం.

– నాయుడు రత్నాజీ, తాళ్లపూడి

కొనలేని పరిస్థితి



ఇటీవల కొద్దీ రోజులుగా పండ్ల ధరలు అమాంతం పెరిగాయి. సామాన్య ప్రజలు పండ్లు కొనుగోలు చేయలేక పోతున్నాం. దీంతో పండ్లు కొని తినలేని పరిస్థితి నెలకొంది. పెరిగిన నిత్యావసర, కూరగాయలు, ఇతర వస్తువుల ధరకు తోడు పండ్ల ధరలు పెరగడంతో వచ్చే సంపాదన అంతా వీటికే సరిపోతుంది.

–పిట్టా ఆనంద కుమారి, అన్నదేవరపేట

తాగునీటి సరఫరాకు చర్యలు



దేవరపల్లి సీబీఎన్ కాలనీలో పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న డీఈఈ పార్వతి

దేవరపల్లి: స్థానిక సీబీఎన్ కాలనీలో గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం డీఈఈ పి.పార్వతి శుక్రవారం సాయంత్రం పర్యటించారు. జలజీవన్ మిషన్‌లో వేసిన పైపులైన్‌ను ఆమె పరిశీలించారు. దాదాపు రెండేళ్ల క్రితం యాదవోలు రోడ్డులోని బోరు నుంచి సుమారు రూ.30 లక్షల వ్యయంతో జలజీవన్ మిషన్ పథకంలో చంద్రబాబు కాలనీకి పైపులన్‌ను ఏర్పాటు చేశారు. ఏడాది క్రితం మండల పరిషత్ నిధులు రూ.15 లక్షల వ్యయంతో బోరు, మోటారు ఏర్పాటు చేశారు. బోరు నుంచి సీబీఎన్ కాలనీకి సుమారు 3 కిలో మీటర్లు దూరం ఉండడంతో నీటి ప్రెషర్‌కు పైప్‌లైన్ జాయింట్లు తరచూ ఊడిపోయి కాలనీకి మంచినీటి సరఫరా అవ్వడం లేదు. దీంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పైప్‌లైన్‌ను డీఈఈ పరిశీలించి ప్రస్తుతం యాదవోలు రోడ్డులో ఉన్న ఓహెచ్‌ఎస్సార్ ట్యాంకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి ట్యాంకు ద్వారా కాలనీకి నీటి సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. ఇది ట్రయల్ రన్ మాత్రమేనని ఆమె తెలిపారు. కాలనీకి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బీఆర్‌ఎస్ కుమారి, పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏచూరికి ఘన నివాళులు



ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నిడదవోలు: సీపీఎం పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు కామ్రేడ్ సీతారామ్ ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళలర్పించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు ఏచూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులరించారు. కార్యక్రమానికి నాయకులు గంటి కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఉస్మాన్, యర్ర శ్రీను, రసూల్, రాఘవ శ్రీరామ్, సీహెచ్ సత్యనారాయణ, అజర్ తదితరులు నివాళులర్పించారు.

ఎలుకల సామూహిక నివారణకు కృషి చేయండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పెరవలి: వరిచేలల్లో ఎలుకల నివారణ కొరకు ప్రభుత్వం అందిస్తున్న మందును రైతులు సామూహికంగా ఒక్కసారే చేలల్లో పెడితే ఫలితం ఉంటుందని వ్యవసాయాధికారిణి మేరీ కిరణ్ తెలిపారు. మండలంలోని 18 గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కోసం మందును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 37 కిలోల బ్రోమోడయోలిన్ మందు దిగుమతి అయ్యిందని, దీనిని గ్రామాల హెక్టార్లను బట్టి పంపిణీ చేస్తామని వివరించారు. ఈ మందులో నూకలు, నూనె కలిపి రైతులకు ఉచితంగా స్వచ్ఛందంగా పంపిణీ చేస్తున్నామని రైతులు దీనిని సద్వినియోగం చేసుకుని ఎలుకల నుంచి పంటను రక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

క్షయ రోగులు పోషకాహారం తీసుకోవాలి

నిడదవోలు: క్షయ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడడంతో పాటు మంచి పోషకాహారం తీసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ అన్సారి ఫయాజ్ సూచించారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం టీబీ వ్యాధిపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఎమ్ఓ డాక్టర్ హారిక మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార బుట్టలు అందించడానికి దాతలు ముందుకు రావాలని ఆమే కోరారు. ఈ నెల 17వ తేది నుంచి వచ్చె నెల 2 వరకు స్వస్థ నారి సశాక్త పరివార అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎస్ లక్ష్మీసుందరి, హెడ్ నర్స్ ఎఫ్సీబా, స్టాఫ్ నర్స్ నాగమణి, ఎస్‌టీఎస్ పోతురాజు, ఎస్టీఎల్ఎస్ రత్నకుమారి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు సమాచారం తప్పనిసరి

నల్లజర్ల: పంచాయతీల అభివృద్ధి పురోగతిని అంచనా వేయడానికి, డేటా ఆధారిత పాలన, పనితీరు, స్థానిక ప్రణాళికను జాతీయ స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అనుసంధానం చేయడానికి అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ 2.0 వ్యూహాత్మక సాధనంగా పనిచేస్తుందని ఎంపీడీఓ కె.యం.మంగతాయారు అన్నారు. మండల పరిషత్ కార్యాయలంలో శుక్రవారం ఇండెక్స్ 2.0పై ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు, గ్రామపంచాయతీ, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్‌గా ఎంపీడీఓ కె.యం.తాయారు వ్యవహరించారు. పంచాయతీలు ఒకదాని కంటే మరోకటి పోటీపడి పనిచేసే విధంగా ప్రోత్సాహం కల్పుతుందన్నారు. గ్రామ స్థాయిలో డేటా సేకరణ, విశ్లేషనకు బలం ఇస్తుందన్నారు. ఈ విషయాలపై అవగాహన పెంచుకొని అన్ని డిపార్టమెంట్ల నుంచి సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్ చేసి జిల్లాకు అవార్డులు తీసుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్ర శిక్షణా కార్యక్రమం

తాళ్లపూడి: నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎంపీడీఓ వేణు గోపాలరెడ్డి పేర్కొన్నారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో అక్షరాంధ్ర కార్యక్రమాల అమలు కోసం చదువు నేర్పేందుకు ఎంపిక చేసిన వాలంటీర్లకు రెండో రోజు శిక్షణ శుక్రవారం నిర్వహించారు. ఉపాధి హామీలో పనులు చేస్తున్న నిరక్షరాస్యులను 110 మంది, వెలుగు మహిళా గ్రూపుల్లో 200 మంది నిరక్షరాస్యులుగా ఉన్నారని, ప్రతి పది మందికి ఒకరి చొప్పున వలంటీర్‌లను నియమించి వారికి శిక్షణ ఇచ్చి అక్షరాస్యులుగా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం మంగాయమ్మ, ఎంఈవో-2 సీహెచ్ నెహ్రూజీ, ఉపాధి హామీ ఏపీవో రమాదేవి పాల్గొన్నారు.

పన్ను బకాయిలు లేకుండా చూడాలి



వివరాలు సేకరిస్తున్న పంచాయతీ అధికారిణి శాంతామణి

తాళ్లపూడి: పన్నుల వసూళ్ల విషయంలో బకాయిలు లేకుండా చూసి, ఆర్థిక, స్థితి గతులను మెరుగు పరచు కోవాలని జిల్లా పంచాయతీ అధికారిణి శాంతామణి సిబ్బందికి సూచించారు. తాళ్లపూడి మండలంలోని ప్రక్కిలంక గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారిణి శాంతామణి చెత్త సేకరణకు వినియోగించే గ్రీన్ వెహికల్స్ పని తీరు, చెత్త సేకరణ చేస్తున్న విధానాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకూడదని, ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఐవీఆర్ఎస్ సర్వే ఫలితంగా ప్రభుత్వం పంచాయతీల పని తీరు ఎలా ఉందన్న విషయాలు ప్రజల నుంచి తెలుసుకునేందుకు గాను, చెత్త తొలగింపు సైతం వివిధ అంశాలను ప్రస్తావిస్తు ఐవీఆర్ఎస్ కాల్స్ చేస్తున్నారన్నారు. దీనిలో ఏ పంచాయతీ పరిధిలో ఎక్కువ లోపాలున్నాయో వాటిని గుర్తించి సరిదిద్దాడానికి అధికారులు స్వయంగా రంగంలోకి దిగి గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీర్డా కేఎస్ వీరన్న తదితరులున్నారు.

ఉద్యోగులను రోడ్డున పడేశారు



కూటమి మోసాలను వివరిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

తాళ్లపూడి(కొవ్వూరు): విద్యార్థులకు ఇవ్వాల్సిన బకాయిలను ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకుండా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. పట్టణంలోని శ్రీరామ కాలనీలో శుక్రవారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' వార్డు స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, స్థానిక పార్టీ నాయకులతో కలిసి చంద్రబాబు 15 నెలల పాలనలోని మోసాలను పట్టణ ప్రజలకు వివరించారు. తలారి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో నాడు నేడు ద్వారా అన్ని పాఠశాలలను అభివృద్ధి చేసి, అమ్మ ఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో నేరుగా సొమ్ములు జమ చేసి విద్యార్థులు పాఠశాలలకు పంపేలా చర్యలు తీసుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకంలో నిబంధనలు పేరుతో కోత పెట్టడంతో నేడు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఘణనీయంగా తగ్గిందని వాపోయారు. ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించడం లేదని దింతో వారు రోడ్డు ఎక్కే పరిస్థితి వచ్చిందన్నారు. చంద్రబాబు మాట ఇస్తాడు కానీ దానిని అమలు చేయడని మోసం చేయడం ఆయన నైజం అని దుయ్యాబట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి పరిమి సోమరాజు, పార్టీ పట్టణ కన్వీనర్ చిట్టూరి అన్నవరం, రాష్ట్ర కార్యదర్శి సుంకర సత్యనారాయణ, కౌన్సిలర్ మద్దిపట్ల సాయిగీత, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు తోట రామకృష్ణ, మాసా ఆనంద్, నేతల వెంకటేష్, వెంకటరత్నం, మోరిపో వీర్రాజు, కవల నాగేశ్వరరావు, నామాప్రకాశం, శ్రీహరిపద్మ, ఉప్పులూరి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బోధనకే పరిమితం చేయాలి



తహసీల్దార్‌కు మెమొరాండం అందజేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

తాళ్లపూడి: ప్రభుత్వం పెండింగులో ఉన్న నాలుగు కరవు భత్యాలను తక్షణం విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు డిమాండ్ చేశారు. సమస్యల సాధనకు నిరసన కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శుక్రవారం తాళ్లపూడి మండల ఏపీటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి తహసీల్దార్ లక్ష్మిలావణ్యకు మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమీషన్ నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. వివిధ యాప్‌లను తొలగించి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘువీర శాస్త్రి, మండల ప్రధాన కార్యదర్శి వై.శంకరం, నాని, రాజు, కృష్ణ, కనకదుర్గ, శేషాబాయమ్మ పాల్గొన్నారు.

తాళ్లపూడిలో రణభేరి పోస్టర్ ఆవిష్కరణ..

ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 15 నుంచి 19 వరకూ జరిగే వివిధ కార్యక్రమాల్లో భాగంగా రణభేరి పోస్టర్‌ను జిల్లా కార్యదర్శి ఈ మనోజ్ కుమార్, మండల అధ్యక్షుడు బి.శంకర్, మండల గౌరవ అధ్యక్షురాలు రాజకుమారి ఆవిష్కరించారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం 15 నెలలు కావస్తున్నా వాటి ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 25న విజయవాడలో వేలాది మందితో బహిరంగ సభ నిర్వహించి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి అల్టిమేట్ ఇవ్వడం ద్వారా రణభేరి మోగించాలని నిర్ణయించిందన్నారు. ఉపాధ్యాయులు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యయరాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

నిడదవోలు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర (ఏపీటీఎఫ్) పిలుపు మేరకు నిరసన కార్యక్రమాల్లో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ నాగరాజు నాయక్‌కు వినతి పత్రం అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సువర్ణ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా డీఏ బకాయిలు ప్రకటించలేదన్నారు. పీపీఎస్ రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించి, పెండింగ్ బకాయిలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ పటక్టణ అధ్యక్షుడు ఏవీ అప్పారావు, కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, మండల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు



ఇన్‌చార్జి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

నిడదవోలు రూరల్: సచివాలయ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ విలేజ్, వార్డు సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు నిడదవోలు మండలంలోని 22 సచివాలయాల ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో పీఆర్ ఏఇ వీవీఎస్ నాగేంద్రరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ సర్వేల పేరుతో ప్రతి ఇంటికి తిప్పుతున్నారని, ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని, సకాలంలో ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం స్పందించికపోతే పోరాటం ఉధృతం చేస్తామని సచివాలయ ఉద్యోగులు హెచ్చరించారు.

ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాలి



ఎంపీడీవో రామారావుకి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

గోపాలపురం: సచివాలయ ఉద్యోగులకు పని భారం పెరిగిపోయిందని, వలంటీర్లు చేయాల్సిన పనులను సైతం తమతో చేయిస్తున్నారని మండలంలోని సచివాలయ ఉద్యోగులు శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీవో కె.శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఇంటింటికీ పింఛన్లు, స్మార్ట్ కార్డుల పంపిణీని తమకే అప్పగించడంతో పని భారం మరింత పెరిగిందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విముక్తి కలిగించాలని, లేని యడల తదుపరి కార్యాచరణ వెల్లడిస్తామని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

నిడదవోలు: ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఉండ్రాజవరం ఎంపీడీవో కార్యాలయం వద్ద సచివాలయ ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ పనిభారాన్ని తగ్గించాలని, పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో వీవీఎస్ రామారావుకి అందజేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్తంగా..

పలువురికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చాగల్లు: మండల పరిధిలోని రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ చాగల్లుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పరామర్శించారు. ఈ మేరకు కార్యకర్తలు టి.నాగమణి, కె.శిరీషాకు ఇటీవల స్కూటీపై వెళ్తుండగా ఆటో ఢీకొనడంతో ఇరువురికి గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకుని తలారి వెంకట్రావు పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఇరువురు త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు ఇంటీ వీర్రాజు, జాలెం వెంకట్రావు, బొర్రా కృష్ణ, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, తాళ్లూరి దామోదరం, బొర్రా రజనీ ప్రసాద్, ఉన్నమట్ల బ్రహ్మనందం తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి సిర్రా గంగారావు తల్లి సుజాతమ్మ గురువారం రాత్రి మృతి చెందారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న కొవ్వూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శుక్రవారం స్థానిక నాయకులతో వెళ్లి సుజాతమ్మ మృతదేహానికి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, నాయకులు తోట రామకృష్ణ తదితరులు ఉన్నారు.

అందరూ ఆస్వాదించే చిత్రం మిస్టర్ సోల్జర్

నల్లజర్ల: అనంతపల్లికి చెందిన ముత్యాల బాలాజీ గత 10 సంవత్సరాలుగా దర్శకుడు శ్రీనివాసరెడ్డి, లారెన్స్, మధుసూదన్‌ల వద్ద అసోసియేట్‌గా పని చేస్తూ శ్రీధరణి ఆర్ట్స్ పతాకంపై రవికిరణ్ హీరోగా 'మిస్టర్ సోల్జర్' అనే చిత్రాన్ని దర్శకుడిగా చిత్రాన్ని తెరకెక్కించారు. తన స్వగ్రామం అనంతపల్లిలో స్నేహితుల మధ్య పాటలు, ప్రీరిలీజ్ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. షూటింగ్ పూర్తయ్యాక ఈ నెల 19న రాష్ట్ర వ్యాప్తంగా ఈ చిత్రం 40 థియేటర్లలో రిలీజ్ కాబోతున్నట్లు దర్శకుడు బాలాజీ ప్రీ రిలీజ్ వేడుకలో తెలిపారు. విజయనగరం, హైదరాబాదు, రాజమండ్రి, మాధవరం ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసినట్టు చెప్పారు. పాటలను సర్పంచ్ వెంగల కమలకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కలం సత్యనారాయణ, వలిరెడ్డి అర్జున్, శ్రీనివాసరావు, ముత్యాలనాని, జడ్డు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. దర్శకుడు మిత్రబృందం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

ప్రతిభ వెలికితీసేందుకే కళా ఉత్సవ్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నల్లజర్ల: దూబచర్లలోని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణసంస్థ (డైట్)లో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో కళాఉత్సవ్–2025 పోటీలు గురు, శుక్రవారాల్లో అట్టహాసంగా జరిగాయి. ఈ మేరకు 6 కళలకు సంబంధించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 60 పాఠశాలల నుంచి 180 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యం.కమలకుమారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేందుకు, విద్యార్థుల్లో పోటీతత్వం పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈనెల 24, 25 తేదిల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. ప్రముఖ నాటకరంగ కళాకారులు జి.రాజర్షి, సంగీత కళాకారిణి సావిత్రి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. నోడల్ అధికారి కె.యస్.వి.కె.రాజకుమారి, సహాయ నోడల్ అధికారి శ్యామూల్ సంజీవ్, పర్యవేక్షకులు యం.నరసింహారావు, అధ్యాపకుడు లక్ష్మీనారా యణ, జాన్సన్, దుర్గప్రసాద్, గోవిందరాజు, విజయ ప్రసన్న, స్వరాజ్య శ్రీనివాస్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఐరన్ మాత్రల పంపిణీ

పెరవలి: మహిళల్లో రక్తహీనత వలన అనేక సమస్యలు తలెత్తుతాయని దీనిని నిరోధించటానికి ప్రతి ఒక్కరు ఐరన్ మాత్రలు వేసుకోవాలని కానూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ హేమరాజు తెలిపారు. కానూరు ఉన్నత పాఠశాల మహిళా ఉపాధ్యాయులకు శుక్రవారం ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటిని క్రమం తప్పకుండా వాడితే మంచి ఫలితాలు ఉంటాయని నిర్లక్ష్యం చేస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మధు, వైద్య సిబ్బంది, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వేతో సమస్యల పరిష్కారం

పెరవలి: స్వామిత్ర రీసర్వేను రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వేను సక్రమంగా చేస్తున్నామని, సమస్యలు ఉంటే ఫిర్యాదు చేసుకోవాలని తహసీల్దార్ కె.నిరంజన్ తెలిపారు. మండలంలోని ఖండవల్లిలో శుక్రవారం గ్రామసభ సర్పంచ్ నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని దీంతో సర్వేని అందరూ విజయవంతంగా పూర్తి చేశామని పేర్కొన్నారు. తాజాగా నిర్వహించిన సర్వేలో ఎన్నో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించామన్నారు. గ్రామంలో ఇంకా సమస్యలు ఉంటే సమావేశంలో ఫిర్యాదులు ఇవ్వాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిటి సన్నిబాబు, ఆర్ఐ పావని, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నూతన అంబులెన్స్ ప్రారంభం

దేవరపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ప్రభుత్వం అందజేసిన అంబులెన్స్‌ను శుక్రవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రారంభించారు. అత్యాధునిక సదుపాయాలతో కూడిన అంబెల్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఇది ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అధికారులు పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.